ప్రజాశక్తి
శనివారం 9 డిసెంబర్ 2023 | 5 | అనంతపురం



దురుసు పోలీసు అధికారులకు

అన్బురాజన్ అంకుశమేసేనా... ?

చుట్టుముడుతున్న వివాదాలు
ఇద్దరు సిఐల సస్పెన్షన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సమాజంలో శాంతి స్థాపనలో పోలీసు శాఖ ప్రధానమైనది. ఏదైనా నేరం జరిగితే దాన్ని గుర్తించి బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఆ శాఖపైనే ప్రధానంగా ఉంటుంది. అంతటి కీలకమైన ఈ శాఖలో కొంతమంది సిబ్బంది అనుసరిస్తున్న దూకుడు వ్యవహారం సమస్యలను తెచ్చిపెడుతోంది. అక్కడక్కడా జరిగే తప్పుల మూలంగా మొత్తం పోలీసు శాఖకే మచ్చ తెచ్చే విధంగా ఉంది. వీటికి జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఏ మేరకు అంకుశం వేయగలరన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఇప్పటికే ఆరోపణలొచ్చిన వారిపై వెంటనే స్పందించి విచారణ చేపట్టి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇది తప్పుచేసే వారిని కట్టడి చేయడానికి కొంత దోహదపడే విధంగా ఉంటోంది. గార్లదిన్నె మండలం కల్లూరులో నిరుపేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు సమయంలో రూరల్ సిఐ నరేంద్రరెడ్డి వ్యవహరించిన



ఎస్పీ అన్బురాజన్

తీరు అనేక విమర్శలకు తావిచ్చింది. చొక్క గుండీలు విప్పి రౌడీలా పేదల పట్ల వ్యవహరించడం, మద్దతుగా వెళ్లిన సిపిఎం నాయకుల పట్ల దురుసుగా వ్యవహరించడం లాంటి చర్యలకు పాల్పడ్డాడు. దీనిపై సిపిఎం నాయకులు జిల్లా ఎస్పీ, డిఐజిలకు ఫిర్యాదు చేశారు. వెంటనే దీనిపై విచారణకు ఆదేశించారు. అయితే విచారణ తరువాత ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సుంది. ఇకపోతే తాజాగా తాడిపత్రి పట్టణంలో సిఐ హమీద్ ఖాన్ ఒక కేసు విచారణలో ఒక వ్యక్తికి విద్యుత్ షాక్ ఇచ్చారని బాధితులు ఆరోపించారు. అది మీడియాలోనూ పెద్దఎత్తున ప్రచారం జరగడంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆయనపైనా విచారణకు ఆదేశించడమే కాకుండా వెంటనే ఆయన్ను విఆర్‌కు పిలిపించారు. ఇది జరుగుతున్న క్రమంలోనే బుక్కరాయసముద్రం మండలంలోని బొమ్మలాటపల్లి గ్రామంలో యానిమేటర్ ఆత్మాహత్యాయత్నానికి ప్రయత్నించడమే కాకుండా తనకేదైనా జరిగితే అందుకు బాధ్యులు సిఐ నాగార్జునరెడ్డి అని ఆరోపించారు. ఈ మేరకు వికలాంగుడైన బాధితుడు మహానందరెడ్డి విడియోలో మాట్లాడి సోషియల్ మీడియాలో పోస్టుపెట్టారు. అనంతరం విషం తాగడంతో బాధితుడిని అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఇది తెలిసిన వెంటనే సిఐ నాగార్జునరెడ్డిని కూడా విఆర్‌కు పంపించారు. వీరి వ్యవహారంపై డిఐజికి నివేదిక పంపారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు డిఐజి అమ్మిరెడ్డి ఇద్దరు సిఐలను సస్పెండ్ చేశారు. ఇలా ఆరోపణలు వచ్చిన వెంటనే ఎస్పీ చర్యలు తీసుకున్నారు. ఇటువంటి చర్యల ద్వారా కింది స్థాయి సిబ్బంది తప్పు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించే విధంగా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బయటకు రాని అంశాలపైనా కూడా ఎస్పీ దృష్టి సారించినట్టు సమాచారం. మాట్కా, గంజాయి అమ్మకాలను కట్టడి చేయడంపై దృష్టి సారించడమే కాకుండా అందులో సిబ్బంది ఎవరైనా భాగస్వామ్యులై ఉన్నారా అన్న దిశగానూ నిఘా సంస్థ ద్వారా సమాచారాన్ని రాబడుతున్నట్టు సమాచారం. అటువంటి ఆరోపణలుంటే వారిపైనా చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. రానున్నది ఎన్నికల సమయం కాబట్టి అంతలోపు కింది స్థాయి అధికారులను, సిబ్బందిని గాడిలో పెట్టే చర్యలకు ఉపక్రమించారు. ఎందుకంటే ఎన్నికల సమయంలో ఎటువంటి చిన్నపాటి ఘటన చోటు చేసుకున్నా రాష్ట్ర వ్యాప్త సమస్యగా మారే అవకాశాముంటుంది. ప్రతిదీ సున్నితమైన సమస్య కావడంతో ఎప్పటికప్పుడు వాటిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మరిన్ని తప్పులు జరగకుండా ఏ మేరకు అంకుశం వేయగలరన్నది చూడాల్సి ఉంది.

'అనంత' కార్పొరేషన్‌లో బకాసురులు



నడిమివంక వరద బాధితుల భోజనాల ఖర్చంటూ రూ. 23 లక్షలు స్వాహా
బాధితుల ఆకలి పేరుతో సొమ్ముచేసుకున్న స్వార్థపూరిత అధికారులు
చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

'కాదేదీ అవినీతికి అనర్హం' అన్న పదానికి అనంత కార్పొరేషన్ అధికారులు నిలువెత్తు నిదర్శంగా నిలిచారు. కార్పొరేషన్‌లోని నిధులు స్వాహా చేయడానికి కొందరు స్వార్థపూరిత అధికారులు వచ్చిన ప్రతి అవకాశాన్ని చేజిక్కించుకుని అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వినపడుతున్నాయి. వారి అవినీతి లీలలు తవ్వే కొద్దీ బయట పడుతూనే ఉన్నాయి. గత ఏడాది నవంబర్ నెలలో వచ్చిన వర్షాలకు అనంతపురం నగరంలోని నడిమివంక దిగువ ప్రాంతం వరద నీటితో మునిగింది. దీంతో బాధితులు సర్వం కోల్పోయారు. దాదాపు 15 రోజుల పాటు తిండీతిప్పలు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడిపారు. వీరి బాధలు చూసిన స్వచ్ఛందసంస్థలు, మానవతావాదులు ముందుకు వచ్చి తమ చేతనైన సాయం చేశారు. ఆహార పట్లాలను పంచారు. సరిగ్గా ఈ సమయంలోనే కార్పొరేషన్‌లో పనిచేసే కొందరు సార్థపూరిత అధికారులు తమ అక్రమాలకు తెరలేపారు. వరద బాధితుల కోసం 15 రోజుల భోజనం ఖర్చు అంటూ ఏకంగా రూ. 23 లక్షల దాకా బిల్లులు చేసుకున్నారు. ఈ విషయంపై 'ప్రజాశక్తి' ఆరా తీస్తే అధికారులు తలాతోకా లేని సమాధానాలు చెబుతున్నారు.

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

గత ఏడాది వచ్చిన వర్షానికి అనంతపురం నగరంలోని నడిమివంక దిగువ ప్రాంతం వరద ముప్పును ఎదుర్కొంది. గతంలో కొందరు స్వార్థపూరిత నాయకుల అవినీతి అక్రమాల కారణంగా నడిమి వంక ప్రొటెక్షన్ వాల్ నిర్మాణపు పనులు అర్ధాంతరంగా ఆగిపోవటంతో ప్రజలు వరద బాధితులుగా మారాల్సి వచ్చింది. ఈ వరద కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలు సర్వస్వం కోల్పోయారు. ఆర్థికంగా చితికి పోయి రోడ్డున పడాల్సి వచ్చింది. రాయలసీమ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంతంలో పడవలు వేసుకుని బాధితులను సురక్షిత ప్రాంతానికి తీసుకురావాల్సి వచ్చింది. ఈ ముంపు నీటిలో స్థానిక ప్రజలు రకరకాల రుగ్మతలతో నెలల పాటు బాధ పడ్డారు. వరద నీటితో సర్వస్వం కోల్పోయిన వారిని ఆదుకునే దిశగా అటు ప్రభుత్వంగానీ ఇటు మున్సిపల్ కార్పొరేషన్ కానీ ప్రజాప్రతినిధులు గాని ఆశించినస్థాయిలో చేయూతను అందించలేదన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. ఆసమయంలో మానవతావాదులు, స్వచ్ఛంధసంస్థల ప్రతినిధులు తమకు చేతనైన సాయం చేశారు. బాధితులకు ఆహారపొట్లాలను పంచారు. నిత్యావసరాలు, దుస్తులు తదితరవాటిని అందజేశారు. అయితే సరిగ్గా ఈ సమయంలో కార్పొరేషన్‌లోని కొందరి అధికారులకు స్వార్థపూరితమైన ఆలోచన వచ్చింది. వరద కష్టాలను సాకుగా చూపి సొమ్ము చేసుకునేందుకు ప్రబుద్ధులు తమ చేతలకు పని చెపాపరు. వరద నీటిలో అష్ట కష్టాలు పడ్డ స్థానిక ప్రజలకు మేలు చేయాలన్న తలంపు లేకపోగా సొమ్ము చేసుకునే ప్రయత్నాలను మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్వార్థ అధికారులు ప్రారంభించారు. దాదాపు 15 రోజుల పాటు బాధితులకు భోజన సౌకర్యం కల్పించడానికి అక్షరాలా రూ. 23 లక్షలు ఖర్చు చేసినట్లు చూపారు. ఇంత ఖర్చు ఎలా చేశారని 'ప్రజాశక్తి' ఆరా తీస్తే విస్తుపోయే వాస్తవాలు బయట పడ్డాయి. భోజనానికి చేసిన ఖర్చుపై అధికారులు తలాతోకా లేని సమాధానాలు ఇచ్చి దాటవేత ధోరణి ప్రదర్శించారు. భోజనాల ఖర్చులో జరిగిన అక్రమాలపై స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులు కమిషనర్ భాగ్యలక్ష్మిని ప్రశ్నించాడు. దీంతో ఈ విషయం తనకు తెలియదని అదనపు కమిషనర్ రమణారెడ్డిని అడగాలని సూచించిందని కార్పొరేటర్ శ్రీనివాసులు తెలిపారు. దీంతో అదనపు కమిషనర్ రమణారెడ్డిని వాకబు చేస్తే తనకేమీ తెలియదని ఇంజనీరింగ్ సెక్షన్ వారు భోజన ఏర్పాట్లు చేశారని సెలవిచ్చారన్నారు. ఈ విషయంపై ఇంజనీరింగ్ సెక్షన్ డిఇ చంద్రశేఖర్‌ను ప్రశ్నించగా తాను కేవలం 6 లక్షల రూపాయలకు మాత్రమే బిల్లు పెట్టానని మిగతా బిల్లు అసిస్టెంట్ ఇంజనీర్ సాయి పెట్టి ఉండవచ్చునని దాటవేత సమాధానమిచ్చారని కార్పొరేటర్ విమర్శించారు. వరద కారణంగా కొంపగోడు కోల్పోయి తిండి తిప్పలు లేక నిద్రాహారాలు లేక 15 రోజులపాటు వరద నీటిలో నానా అగచాట్లు పడిన ప్రజలకు అధికారులు ఎలాంటి సాయం చేయలేదదని, స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు అందించిన ఆహార పొట్లాలు తాగునీటి ప్యాకెట్లతో ప్రాణాలు కాపాడుకున్నారని కార్పొరేటర్ శ్రీనివాసులు తెలిపారు. 'శవాలపై పేలాలు ఏరుకున్నట్లు'గా వరద నీటిలో అష్ట కష్టాలు పడ్డ తమ ప్రాంత ప్రజలు ఆదుకోక పోగా ప్రజలకు భోజన వసతి కల్పించామని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏకంగా 23 లక్షల రూపాయలకు బిల్లులు పెట్టారంటే వారిని ఏమనాలో అర్థం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత అవినీతి జరిగిఉంటే కమిషనర్ మాత్రం తనకేమీ తెలియదని పేర్కొనటం దారుణమన్నారు. 'కంచే చేను మేసిన' విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతుంటే కార్పొరేటర్‌గా తాను సిగ్గుతో తల దించుకోవాల్సి వస్తోందని వాపోయారు. కేవలం భోజనాల ఖర్చు పేరుతో 23 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు బిల్లులు పెట్టుకున్నారంటే ఇక మిగతా వాటిలో మరెన్ని లక్షల రూపాయలు దిగమింగారో అర్థం చేసుకోవచ్చని అయన వ్యాఖ్యానించారు.



అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం

జెఎన్‌టియు టీచింగ్ అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్

11 నుంచి నామినేషన్ల స్వీకరణ
16న పోలింగ్..సాయంత్రం ఫలితాల ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల బోధనా సిబ్బంది ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న 4గంటలలోపు టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్షులు, ట్రెజరర్ల నియామకానికి ఉత్సాహవంతులు నామినేషన్లు సమర్పించాలన్నారు. 13వతేదీ వరకూ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చన్నారు. అదేవిధంగా సెక్యూరిటీ నామినేషన్ ఈనెల 13 వరకూ దాఖలు చేసుకోవచ్చన్నారు. 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. అదేరోజు 12 గంటల నుంచి ఒంటిగంట మధ్య ఫలితాలు ప్రకటించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు అన్యాయం

ఎస్ఇ కార్యాలయం ముందు ధర్నాలో ఎపిరైతుసంఘం నాయకులు



ధర్నాలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ పంపుసెట్లను మీటర్లు బిగించాలన్న ప్రభుత్వ నిర్ణయం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ అధికారుల ద్వారా రైతులను బెదిరించి ఉచిత విద్యుత్ ఎత్తివేసే చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ట్రాన్స్‌కో ఎస్ఇ కార్యాలయం ముందు ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022లో భాగంగా వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన ప్రయత్నాలు చేయడం ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడుతుంటే రైతులు వ్యతిరేకిస్తున్నారని, గార్లదిన్నె, శింగనమల, కనేకల్ మండలాల్లో విద్యుత్ అధికారులు రైతులను బెదిరిస్తున్నారని విర్శంచారు. డైరెక్ట్ బెనిఫిసరి ట్రాన్స్‌ఫర్ స్కీం కింద సబ్సిడీ డబ్బులు ఒక మోటార్ హెచ్‌పికి రూ. 1150 రైతుల ఖాతాలలో జమ చేస్తామని ముందుగా రైతులు బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, మార్కెట్ సర్టిఫికెట్‌తో ఎఇతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకపోతే విద్యుత్ సబ్సిడీ రాదని రైతులను బెదిరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ చర్యలు తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు చేసే చర్యలతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. విద్యుత్ సవరణ బిల్లును 11 రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించినా నగదు బదిలీ పేరుతో వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు మంగళం పాడాలన్నదే కేంద్ర ప్రభుత్వం విధానామన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్ర విధానాలను అమలు చేసేదానిలో భాగంగా తన తండ్రి అమలు చేసిన ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకు సిద్ధమయ్యాడని విమర్శించారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తే అదే రైతుల మెడకు ఉరితాడుల వేలాడుతుందని అన్నారు. మీటర్ల బిగింపునకు దొడ్డిదారిలో ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. రైతులకు నష్టం చేసే ఈ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని ఉచిత విద్యుత్తు పథకాన్ని కొనసాగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి శివారెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, సంగప్ప, పోతులయ్య, నల్లప్ప, శ్రీనివాసులు, వన్నూరప్ప, శంకర్, నల్లప్ప, నాగమ్మ, కొత్తపల్లి రాము తదితరులు పాల్గొన్నారు

ఆక్రమిత అటవీభూములు స్వాధీనం చేసుకోవాల్సిందే..

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం, ముకుందాపురం, పెనకచర్ల డ్యాం గ్రామాల పరిధిలో ఆక్రమణకు గురైన అటవీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వి.రాంభూపాల్ మాట్లాడుతూ అటవీ భూములు అన్యాక్రాంతం అవుతుంటే ప్రభుత్వం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. భూస్వాములు కబ్జా చేస్తే పెడచెవిన వేసుకుంటారని అదే పేదలు ఎక్కడైనా సెంటు భూమిలో సామాన్యులు గుడిసెలు వేసుకుంటే పోలీసు బలగాలు మోహరించి ఖాళీ చేయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం అందరికి సమానంగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెత్తందారులకు ఒక చట్టం, పేదలకు మరొక చట్టం అమలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. అటవీ భూములు ఆక్రమించిన వారికి అటవీశాఖ అధికారులు అండగా నిలుస్తుండం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆ భూములను స్వాధీనం చేసుకుని వన సంరక్షణ క్రింద పేదలకు పండ్ల తోటల సాగుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నల్లప్ప, రాముడు, బి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో మూతబడిన స్పిన్నింగ్ మిల్లు స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దాసరి చరణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో ఉపాధి లేక వేలాది మంది యువత ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తోందన్నారు. అంతేగాకుండా చదువులకు తగ్గ ఉద్యోగం లేక భవన నిర్మాణ, ఆటో కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి అనేక వనరులు ఉన్నా వాటిని ఉపయోగించుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. పాలకుల అలసత్వం కారణంగా స్పిన్నింగ్ మిల్లు, తోళ్ల పరిశ్రమ, స్లీపర్ ఫ్యాక్టరీ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు మూతబడ్డాయన్నారు. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. ఐటిఐ చదివిన విద్యార్థులకు పట్టణంలోనే అప్రెంటీస్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకూ సంతకాల సేకరణ, సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18న స్థానిక స్పిన్నింగ్ మిల్లు దగ్గర నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర, పట్టణ అధ్యక్షులు మద్దికర ప్రతాప్, నాయకులు చొక్కా సునీల్‌కుమార్, శ్రీనాథ్, మురళి, బాలు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

తాడిపత్రి, బుక్కరాయసముద్రం సిఐల సస్పెన్షన్

ప్రజాశక్తి - అనంతపురం క్రైం

జిల్లాలోని ఇద్దరు సిఐలను సస్పెండ్ చేస్తూ డిఐజి అమ్మిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడిపత్రి అర్బన్ సి.ఐ హమీద్‌ఖాన్ యువకుడికి విద్యుత్ షాక్ ఇచ్చారని మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈయనతోపాటు బుక్కరాయసముద్రం సిఐ నాగార్జునరెడ్డి తనను కొట్టినట్లు బొమ్మలాటపల్లికి చెందిన వికలాంగుడు మహానందరెడ్డి సోషల్ మీడియాలో వాపోయాడు. ఇందుకు సంబందించి ఎస్పీ నివేదిక మేరకు డిఐజి అమ్మిరెడ్డి ఇద్దరు సిఐలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

14,15న కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి -బొమ్మనహాల్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14, 15వ తేదీల్లో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు మండలంలోని ఆశావర్కర్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని శ్రీధర్‌గట్ట పిహెచ్‌సిలో డాక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు పదవీ విరమణ వయస్సు 62ఏళ్లకు పెంచాలని, కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా నియమించాలని, రూ.10లక్షల వరకూ బీమా ఇవ్వాలని, డిమాండ్ చేశారు.

11 నుంచి 'అనంత సంకల్పం' అమలు

డిఇఓ నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఈనెల 11వ తేదీన ఉంచి వంద రోజుల 'అనంత సంకల్పం' అనే కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలని డిఇఓ నాగరాజు సూచించారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో అనంత సంకల్పం మెటీరియల్ తయారీపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధిచేందుకే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన పదో తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వారికిఉపయోగపడేలా మెటీరియల్స్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి కృష్ణయ్య, పరీక్షల విభాగం ఎసి గోవిందనాయక్, డిసిఇబి సెక్రరీ పురుషోత్తంబాబు, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీలు కొనసాగిస్తూ ఉత్తర్వులు..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని తల్లిదండ్రుల కమిటీలను (పాఠశాల యాజమాన్య కమిటీలను) కొనసాగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు ఉత్తర్వులను విడుదల చేసినటుల సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వరప్రసాద రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1779 పాఠశాలలు ఉండగా, 1773 పాఠశాల యాజమాన్య కమిటీలు తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ కొనసాగుతాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఓ నాగరాజు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యంలో నాయకుల వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి పంటకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం ఇవ్వాలని, పంట నష్టపరిహారం గరిష్టంగా నాలుగెకరాల వరకూ ఇవ్వాలని, సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు, విత్తు వేయని రైతులకు రూ.30వేలు, వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని, వలసల నివారణకు ఉపాధి హామీ పథకం కింద పని 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని, పట్టణాలు, నగరాల్లో 'ఉపాధి' పనులు పెట్టాలని, రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, రైతు, కౌలు రైతు వ్యవసాయ కార్మిక కుటుంబాల విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని, గ్రామాల్లో సంఘం కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, మండల సహాయ కార్యదర్శి జి.చౌదరి, మండల నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ్, రామచంద్రారెడ్డి, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయడంతోపాటుగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వ్యవసాయ పెట్టుబడులకు నూతన అప్పులు మంజూరు చేయాలన్నారు. అలాగే జీవో 5ను రద్దు చేసి పంటలు సాగు చేసిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.45 వేలు, సాగు చేయని రైతులకు రూ.30 వేలు చెల్లించాలన్నారు. గ్రామాల్లో 200 రోజులు ఉపాధి పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి గిట్టుబాటు కల్పించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.10 లక్షల పరిహారం అందించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మారుతీప్రసాద్, సాకే నాగరాజు, చంద్రశేఖర్, ఎస్‌కెఎం.బాషా, అబ్దుల్లా, కిష్టప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకీ, చెర్రీ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించి ఆదుకోవాలని ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కారదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, రైతు సంఘం మండల సహాయ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్టపోయిన ప్రతి పంటకూ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, సుంకన్న, ఎర్రిస్వామి, ఆంజనేయులు, జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, వెంకట్‌నారాయణ, రాజు, నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పరిహారం చెల్లించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, కెయుపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం అనంత ను కరువు జిల్లాగా ప్రకటించినప్పటికీ కరువు సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు సొంత గ్రామాల్లోని ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు సునీత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


పుట్లూరులో డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

బుక్కరాయసముద్రం : రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్, వ్యవసాయ శాఖ ఎఒ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావం వల్ల పంటలన్నీ ఎండిపోయాయన్నారు. కావున రైతులకు నష్టపరిహారం అందివ్వడంతోపాటు బ్యాంకుల్లో రైతుల రుణాలను మాఫీ చేయాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, మండల రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట కొండ, డి.శ్రీనివాసులు, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, వ్య.కా.సం మండల నాయకులు పుల్లయ్య, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అన్నచేతిలో తమ్ముడు హతం

శెట్టూరు : అన్న చేతిలో తమ్ముడు హతమైన ఘటన గురువారం రాత్రి మండలంలోని కనుకూరు గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి తల్లి గొల్ల మల్లక్క తెలిపిన వివరాల మేరకు.. మల్లక్క, గొల్ల గోపాల్‌కు ముగ్గురు సంతానం, వీరిలో గొల్ల రవి కూలి పనులు, కృష్ణమూర్తి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో గురువారం పెద్ద కొడుకు రవి కళ్యాణదుర్గం వెళ్తూ తమ్ముడు కృష్ణమూర్తికి చెందిన సెల్‌ఫోన్ తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న కృష్ణమూర్తి తన సెల్ తీసుకునేందుకు ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గం వెళ్లాడు. అక్కడ ఇద్దరూ వాదోపవాదాలు చేసుకుని కొట్టుకున్నారు. తిరిగి ఇద్దరూ ఒకే వాహనంపై ఇంటికి వచ్చారు. రవి నుదుట గాయం ఉండటంతో ఏం జరిగిందని తల్లి ఆరాతీసింది. కృష్ణమూర్తి రాయితో కొట్టడంతో గాయమైందని రవి వివరించాడు. ఈనేపథ్యంలో రాత్రి కృష్ణమూర్తి ఇంటి మొదటి రూములో పడుకున్నాడు. రవి ఇంటి ముందు ఉన్న కొట్టంలో నిద్రపోయాడు. అయితే అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దం వినిపించడంతో నిద్ర లేచిన తల్లి మల్లక్క ఇంట్లో నిద్రపోతున్న కృష్ణమూర్తిపై పెద్దకొడుకు రవి గొడ్డలితో నరుకుతూ కనిపించాడు. దీంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి చూడగా కృష్ణమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రవి పారిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా..పలువురికి గాయాలు

పామిడి : మండలం రామరాజుపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న ఐచర్ వాహనం, పామిడి నుంచి గుత్తికి వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్ శివయ్యతోపాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కిడ్నీ బాధిత మహిళా కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

కిడ్నీ బాధిత మహిళా కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం అందించి జిల్లా పోలీస్ శాఖ మానవత్వం చాటుకుంది. అనంతపురం ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ కుళ్లాయమ్మకు కిడ్నీకి సంబంధించిన వ్యాధి సోకింది. దీంతో కిడ్నీ మార్పిడికి ఇబ్బంది పడుతుండగా గమణించిన పోలీస్ శాఖ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ వరకూ ఆర్థికసాయం అందించారు. ఇలా సేకరించిన రూ.7.20 లక్షల చెకు, రూ.50 వేల నగదును బాధిత కుటుంబానికి ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ అందజేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, డిసిఆర్‌బి సిఐ విశ్వనాథచౌదరి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులునాయుడు, సరోజ, తదితరులు పాల్గొన్నారు.


కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవమ్మకు కన్నీటి వీడ్కోలు

వేలాదిగా తరలివచ్చిన అభిమానులు - హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

ప్రజాశక్తి-ఉరవకొండ

శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి అంత్యక్రియలు శుక్రవారం స్వగ్రామం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో నిర్వహించారు. ఉమాదేవి పార్థీవదేహాన్ని హైదరాబాద్ నుంచి గురువారం సాయంత్రం కొనకొండ్లకు తీసుకొచ్చారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో అభిమానులు, నాయకులు భారీగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తగిన బందోబస్తు చేపట్టింది. నివాళులర్పించిన వారిలో మంత్రులు ఉషశ్రీచరణ్, గుమ్మనూరు జయరాం, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, ఎస్‌వి మోహన్‌రెడ్డి, రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, మాజీమంత్రి, ఏఐసీసీ మెంబర్ రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లె రఘునాథ్‌రెడ్డి, విశ్వేశ్వర రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, ఉన్నారు.


ఉమాదేవమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసిపి నాయకుడు లక్ష్మీనారాయణ (45) శుక్రవారం రాత్రి మరణించాడు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆయన సర్పంచిగా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఎంతో చురుగ్గా వ్యవహరించేవారు. ఆయన భార్య నాగేశ్వరమ్మ ప్రస్తుతం వైస్ ఎంపిపిగా కొనసాగుతున్నారు. నెల క్రితం ఆయన అనారోగ్యానికి గురయ్యారు. స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నా పరిస్థితి విషయంగా ఉండడంతో కర్నూలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం

బెలుగుప్ప : వికలాంగులు అందరితోపాటు ఆత్మస్థైరం కోల్పోకుండా ముందుకు సాగాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు వసంతకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సిబ్బంది హెచ్ఆర్ రామాంజనేయులు, ధనలక్ష్మి, రాజేష్, మారెప్ప, మస్తాన్, శివ, వికలాంగులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ఉరవకొండ : విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన వన్నూరప్ప (38) కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేస్, వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్షావలి శుక్రవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. మిగతా రూ.90 వేలను త్వరలోనే వారి కుటుంబ సభ్యుల అకౌంట్లో జమవుతుందన్నారు.

పంట నమోదు చేసుకోండి : ఎంపిపి

బుక్కరాయసముద్రం : రైతులు రబీలో సాగు చేసిన పంటలను అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పెద్ద కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ రైతులు ఈక్రాప్ చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు అందుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పంటలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామ్‌గోపాల్, ఎంపీటీసీలు, సర్పంచులు, రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి ప్రత్యేకపూజలు

పామిడి : ఏకాదశిని పురస్కరించుకుని పామిడి అనంత, గజ, గరుడ, లక్ష్మీ నారాయణ స్వామికి తగ్గు దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన అర్చకులు విశ్వనాథశర్మ మాట్లాడుతూ స్వామివారికి అభిషేకం, అర్చనలు, విష్ణు సహస్ర నామపారాయణం చేశామన్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత లక్ష్మీ నారాయణ స్వామి ఉత్సవమూర్తులను అలంకరించిన పల్లకీ లో ఉంచి ప్రాకారోత్సవం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, భక్తసంఘం సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగుడిపై సిఐ దాడి అమానుషం

బుక్కరాయసముద్రం : వికలాంగుడిపై సిఐ నాగార్జునరెడ్డి దాడి చేయడం అమానుషమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. బొమ్మలాటపల్లికి చెందిన వికలాంగుడు మహానందరెడ్డిని విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిచి చిత్రహింసలకు గురి చేయడం బాధాకరమన్నారు. వికలాంగుడి పరిస్థితి చూస్తే ఎవరికైనా బాధ కలుగుతుందన్నారు. మహానందరెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దిగువపల్లిలో సాయిప్రతాప్‌రెడ్డి పర్యటన

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని దిగువపల్లి గ్రామపంచాయతీలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అనంతవాసులు

అనంతపురం : సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఆక్వాటిక్ అంతర్ జిల్లా ఛాంపియన్‌షిప్ పోటీలకు ఈత క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కామని రవిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 16, 17వ తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలుర గ్రూప్-1లో అభయ్ అలాహం, గ్రూప్ -2లో జస్విన్‌నాయుడు, పురనందీశ్వరరాజులు, అకుల్‌సాయి, గ్రూప్-3లో అభిషేక్, చిరుదీప్, బాలికల గ్రూప్-3లో ప్రశాంతి, సిద్ర ఇలాహి, జస్మితను ఎంపిక చేసినట్లు తెలిపారు.


క్రీడాకారులతో అతిథులు

'జగనన్నకు చెబుదాం'కు 61 దరఖాస్తులు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 61 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. ఇందులో ఎక్కువగా భూసర్వేకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారిణి ఓబుళమ్మ, పీడీ నరసింహారెడ్డి, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ రామరంగారెడ్డి, డీటీ మల్లేష్‌ప్రసాద్, ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, ఎంఇఒ శ్రీదేవి, ఏవో కాత్యాయని, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉచిత వైద్యమే లక్ష్యం

ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతి పేదవాడికీ ఉచిత వైద్యం అందించడమే లక్ష్యమని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. 'సన్ రే' ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు భారతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు ముందుకొచ్చిన సన్ రే ఆసుపత్రి ముందుకు రావడం అభినందనీయమన్నారు. విప్ కాపు, భారతి కుమార్తె డాక్టర్ స్రవంతి నివేదితారెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నటు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి బుధవారం, శుక్రవారాల్లో ప్రత్యేక వైద్యులతో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న విప్ కాపు కూతురు డాక్టర్ నివేదితారెడ్డి

పోలీస్ స్పోర్ట్స్, గేమ్‌మీట్ ప్రారంభం

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ స్పోర్ట్స్, గేమ్‌మీట్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సబ్ డివిజినల్ పోలీసు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. ఉదయం కళ్యాణదుర్గం, అనంతపురం జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. వీటిలో అనంతపురం సబ్ డివిజినల్ పోలీసు జట్టు విజయం సాధించింది. సాయంత్రం అనంతపురం రూరల్, గుంతకల్లు పోలీసు సబ్ డివిజన్ల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో గుంతకల్లు సబ్ డివిజినల్ పోలీసు జట్టు గెలుపొందింది. ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, ఆర్ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, మగ్బూల్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం, అభివృద్ధి


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

రాయదుర్గం : వైసిపి ద్వారానే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కుంబారు గుండు వీధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కర్యాక్రమంలో వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఛైర్‌పర్సన్ గౌని ఉపేంద్రరెడ్డి, పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళు శిల్ప, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ఆరవ శివప్ప, వార్డు సభ్యులు శ్రీలక్ష్మి, శారద, అజయ్‌కుమార్, లావణ్య, నాగవేణి, పద్మజ, షబ్బీర్, గోవింద, ఫక్రుద్దీన్, దేవరాజ్, శ్రీనివాసులు రెడ్డి, గజాల, సాబిరబి, కో ఆప్షన్ సభ్యులు నజీర్, శ్రీనివాసులు, బ్యులా, శ్రీనివాసులు, శ్రీనివాసులు, వైజాగ్ రవి, ఇస్మాయిల్, బషీర్, నిజాముద్దీన్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లింగ నిర్ధారణ నిషేధచట్టం అమలు

అనంతపురం : ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు డిఎంఅండ్‌హెచ్ఒ ఇబి.దేవి తెలిపారు. శుక్రవారం బళ్లారి జిల్లాలో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిఎంఅండ్‌హెచ్ఒ మాట్లాడుతూ బళ్లారి, తుముకూరు, చిత్రదుర్గ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న అనంతపురం జిల్లాకు చెందిన మండలాల పరిధిలో లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లోని గర్భిణులు పక్క జిల్లాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నట్లు అనుమానాలున్నాయన్నారు. ఇలాంటి సమాచారం బదిలీ చేసుకోవడం ద్వారా కఠిన చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కావున అనంతపురం, బళ్లారి, తుముకూరు, చిత్రదుర్గ జిల్లాల పరిధిలోని సరిహద్దుల్లో నడుస్తున్న స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిపిఎన్ డిటి నోడల్ అధికారి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

పివికెకెలో ఇంటర్ కళాశాలల క్రీడాపోటీలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలోని పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజులపాటు బాలాజీ విద్యాసంస్థల జూనియర్ కళాశాలల మధ్య క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల ఛైర్మన్ కిషోర్ పల్లె తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి పి.నరసింహారెడ్డి, విశ్రాంత క్రీడాధికారి (సాప్) జి.వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యతోపాటు క్రీడలు కూడా అంతర్భాగంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకుగాను అంతర్జాతీయ స్థాయిలో కళాశాలల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారిణి పల్లె సింధూర, రిటైర్డ్ కేరళ డీజీపీ శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, బాలాజీ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ వైభవ్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా బంగి శివ



రాయదుర్గం : అనంతపురం ఉత్తర ప్రాంత ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా పట్టణానికి చెందిన బంగి శివ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 6, 7వ తేదీల్లో కళ్యాణదుర్గంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండవసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు సహకరించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం, రాయదుర్గం పట్టణ సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతను నిబంధనలకు కట్టుబడి పని చేస్తానన్నారు. అదేవిధంగా జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై, ప్రభుత్వ పాఠశాలు, సాంఘిక సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ విద్య పరిరక్షణకై, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు ఫీజుల రూపంలో చేస్తున్న దోపిడీలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

చౌక దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు చౌక దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ వెంకటరమణ, సిఎస్ డిటి కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని రెండు స్టోర్లు, గుత్తి ఆర్ఎస్‌లోని ఒక స్టోర్‌లో తనిఖీలు చేశారు. అలాగే మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎండియు వాహనాల్లో తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ వాసు ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అసైన్డ్ భూ పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అసైన్డ్ భూ పంపిణీకి సంబంధించిన పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ హరికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వానికి ఇన్‌పుట్ సబ్సిడీ నివేదికలు

అనంతపురం : మండల పరిధిలో 2023 ఖరీఫ్ సాగు చేసి నష్టపోయిన రైతుల వివరాలను ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి కె.సాయిలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక కృషిభవన్‌లో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో మెట్ట ప్రాంతాల్లో నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించామన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాల నివేదికలను ఆయా ఆర్‌బికెల్లో అతికించామన్నారు. రైతులందరూ తమ పేర్లు, పంట విస్తీర్ణం సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు రామసుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, పరమేష్‌నాయక్, చలపతి, శివారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు అలేఖ్య, మురళీకృష్ణ, రైతులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి కె.సాయిలక్ష్మి


పోస్టర్లను విడుదల చేస్తున్న ఆవాజ్ నాయకులు

'ఆవాజ్' ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్ : తెహరికె పైజానే ఉమర్ వారి 14వ వార్షిక సున్ని ఇజ్ తెమా కార్యక్రమం ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి అన్నారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 10న జూనియర్ కళాశాల మైదానంలో మధ్యాహ్నం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య వక్తగా భూసావల్ నుంచి సయ్యద్ అబ్దుల్ హబీబ్ సాహెబ్, కర్ణాటక నుంచి నాసిర్ రజాఖాన్ ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ప్రత్యక్షంగా ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి సాహాబాల పవిత్ర కేశాలు వారు ధరించిన దుస్తులు ప్రజల సంద్శనార్థం ఉంచుతున్నారని తెలిపారు. ఇజ్ తెమాకి వచ్చు వారి కోసం వజూ ఖానా, టాయిలెట్స్, మహిళల కొరకు పరద సౌకర్యము, రాత్రి అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, కార్పొరేటర్ జనబలం బాబా, రిటైర్డ్ ఎస్‌పి రజాక్, ప్రజా సంఘాల నేతలు జాకీర్, జీలాన్, ఫిరోజ్, జేమ్ బాషా, శౌకత్ ఖాన్, నిజాం, షబ్బీర్, ప్రజాసంఘాల నేతలు మసూద్, నూర్, జిలాన్ ఖాన్, సాదిక్, ఇమామ్, అంజూ ఖాన్, నిసార్ నజీర్, షర్మస్, ఇస్మాయిల్, ఫక్రు, మస్జీద్ ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వీష్, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్, హబీబ్, డాక్టర్ షఫీ, ఆరీఫ్, అబ్దుల్ సమీ, చాంద్‌బాషా, మహబూబ్ బాష, హుస్సేన్, శౌకత్ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల వినియోగంపై అవగాహన

రాయదుర్గం : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ వినియోగంపై పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ క్యాలెండర్ ప్రకారం డిసెంబర్ నెల 9వ తేదీతో ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి ఆఖరు గడువు ముగుస్తుందన్నారు. కావున ఓటర్ జాబితాలో తమ పేరు ఉందో.. లేదో.. తెలుసుకోవాలన్నారు. లేకుంటే 9వతేదీలోగా సంబంధిత పోలింగ్ బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని కోరారు.

జెఎన్‌టియు ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

అనంతపురం : అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్‌టియు ఇంటర్ యునివర్సిటీ పురుషుల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక కోసం సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించినట్లు జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరి జోజిరెడ్డి తెలిపారు. అనంతలక్ష్మి కళాశాలకు ఏ కార్యక్రమ నిర్వహణ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. కాగా సాఫ్ట్‌బాల్ జట్టులో మెరికల్లాంటి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ రామమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమల ఎస్ఐగా పి.విజయభాస్కర్

శింగనమల : మండల నూతన ఎస్ఐగా పి.విజయభాస్కర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిశా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే మట్కా, కోడిపందేలు, ఇసుక మాఫియా, గ్యాంబ్లింగ్ వంటి వాటికి పాల్పడుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

మిరపలో రసం పీల్చే పురుగును నివారించుకోవాలి

పుట్లూరు : రైతులు సాగు చేసిన మిరప పంటలో రసం పీల్చే పురుగును నివారించుకోవాలని జిల్లా ఉద్యానవన సహాయ సంచాలకులు నరసింహారావు సూచించారు. శుక్రవారం మండలంలోని శనగల గూడూరులో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రసం పీల్చే పురుగు నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా సామూహికంగా నీలి, పసుపు రంగు అట్టలను ఎకరాకు 25 నుంచి 30 వరకూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే బవేరియా బగియాన 5 గ్రా, వర్టిసీలియం లెకాని 5 గ్రా, పంచగవ్య 30 మిల్లీలీటర్లను లీటరు నీటికి చొప్పున కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడి ఫజులున్నీసా బేగం, ఉద్యాన అధికారిణి, శైలజ, రైతు భరోసా కేంద్రం అధికారిణి రామలక్ష్మి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.